
కూకట్‌పల్లి వెంకట్రావ్‌నగర్ కాలనీలో ..






మాంటిస్సోరి విద్యాలయ పాఠశాలలో..

సందడిగా బతుకమ్మ వేడుకలు


సందడి చేస్తున్న యువతులు


బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న అక్కా చెల్లెళ్లు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో అమావాస్య రోజు నిర్వహించే బతుకమ్మకు భారీగా స్పందన లభించింది. కూకట్‌పల్లి ప్రాంతంలో మాత్రం ఇది మూడవ రోజు కాగా, నియోజకవర్గంలోని మిగిలిన ప్రాంతాల్లో మొదటి రోజు బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు భారీ ఎత్తున బతుకమ్మ ప్రాంగణాల వద్దకు వచ్చి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా వయో వృద్ధులు కూడా బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. సీనియర్ సిటిజన్ అయిన గొట్టిముక్కల సావిత్రమ్మ తన బతుకమ్మ పాటలతో మహిళలను ఉత్సాహ పరుస్తూ ఆటా, పాటలతో అలరించారు. కూకట్‌పల్లిలో బతుకమ్మలను భారీ ఎత్తున తీసుకురావటంతో రెండు గ్రూపులుగా ఏర్పడి బతుకమ్మలు ఆడారు. ఈ సందర్భంగా చౌదరి పూర్ణరేఖ, మాధవరం సరితారావులు తమ ఆట పాటలతో కనువిందు చేశారు. ఈ సందర్భంగా మహిళలు వారితో గొంతు కలిపి స్టెప్పులేస్తూ సందడి చేశారు. కూకట్‌పల్లిలోని హనుమాన్ చౌక్ వద్ద దాదాపు అర కిలోమీటర్ వరకు బతుకమ్మలను రోడ్డుపైనే ఉంచి మహిళలు ఆటఆడటంతో కూకట్‌పల్లి ప్రధాన రహదారి పూర్తిగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సురేందర్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు. మహిళా ఎస్ఐలు, కానిస్టేబుళ్లను భారీ ఎత్తున వేడుకల వద్ద ఉంచారు. హనుమాన్‌చౌక్ వద్ద సుమారు 8 గంటల వరకు బతుకమ్మ ఆటా పాటలతో సంతోషాన్ని వ్యక్తం చేసిన మహిళలు అనంతరం రంగధాముని చెరువు వద్దకు వెళ్లి బతుకమ్మలను నిమజ్జనం చేశారు.


బతుకమ్మను రంగురంగు పూలతో పేరుస్తున్న సీనియర్ సిటిజన్ సులోచన

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీలోని ఎస్ఎస్‌డి గ్రామర్ హైస్కూలులో శనివారం దసరా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సురభి రవీందర్‌రావు, సురభి దుర్గావాణి, చెన్నమనేని స్రవంతి, సురభి తేజశ్విని, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని వి. రామారావు నగర్‌లో బతుకమ్మ వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ సబిహా బేగం శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలతో బతుకమ్మ ఆడి అందరినీ ఆకట్టుకున్నారు.

బతుకమ్మ పండుగకు అధికారులు సహకరించాలి

కూకట్‌పల్లి: బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రంగధాముని చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులు ఎటువంటి ఏర్పాట్లు చేయలేదున్నారు. రాజకీయాలకు అతీతంగా బతుకమ్మ పండుగ వేడుకలకు ఎన్నికల అధికారులు సహకరించాలని కోరారు.

మూసాపేట: మూసాపేట పంచశీల పాఠశాలలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా బతుకమ్మ సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరొక్క పూలను వరుసలో పేర్చి పూజించి, ప్రకృతిని ప్రేమించే సంస్కృతి తెలంగాణకు మాత్రమే సొంతమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత దాదాపు ప్రతి పాఠశాలలో చిన్నారులకు బతుకమ్మ పండుగ విశిష్టతను తెలియజేస్తూ, ఈ వేడుకలను ఘనంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధినేత డి. శ్రీనివాస్, అరుణ్, వీరాచారి, వినోద్, రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని మాంటిస్సోరి విద్యాలయ పాఠశాలలో శనివారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు పాటలు పాడుతూ, కోలాటాలతో నృత్యాలు చేస్తూ బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.


కూకట్‌పల్లిలో అతి పెద్ద బతుకమ్మతో మహిళ


రంగధాముని చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

క్లుప్తంగా

ఫతేనగర్ శ్మశాన వాటికకు వైకుంఠ రథం అందజేత



బాలానగర్: కాంగ్రెస్ పార్టీ ప్రోటోకాల్ కమిటీ మెంబర్ సూరజ్ తివారి ఆయన తల్లి దివంగత భాగవత్ దాస్ సత్యవతి తివారీ పేరు మీద ట్రస్టును ఏర్పాటు చేశారు. ట్రస్టు కార్యక్రమాల్లో భాగంగా శనివారం వైకుంఠ రథాన్ని ఫతేనగర్ స్మశాన వాటికకు అందజేశారు. కార్యక్రమంలో ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళ రావు, తదితరులు పాల్గొన్నారు.

మేరా మాటీ.. మేరా దేశ్ కార్యక్రమం



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో శనివారం నిర్వహించిన మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొరటాల నరేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజు, రఘు, కేశవరావు, అనిత, రమేష్, అమర్నాథ్, సంతోష్, శ్రీకాంత్, శివలింగం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పరిధి జీడిమెట్ల గ్రామంలోని గాంధీ విగ్రహం వద్ద శనివారం వాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతినెలా అమావాస్యను పురస్కరించుకుని పేదలకు అన్నదానం చేస్తూ వస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ సేవాదళ్ సభ్యులు తోట భిక్షపతి, పడకంటి వెంకటేశం, పల్లా నాగరాజు, ఈశ్వర్‌రాజ్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు


శ్రీ విజయదుర్గ దేవి అమ్మవారు


శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి శ్రీవిజయదుర్గదేవి ఆలయం వద్ద ఏర్పాట్లు

ఓల్డ్ బోయిన్‌పల్లి: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలకు ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ఆలయాలు, మండపాలు అందంగా ముస్తాబయ్యాయి. ఆలయాలకు, మండపాలకు విద్యుత్ అలంకరణలు, కొత్తరంగులు, ఇతర అలంకరణలతో తీర్చిదిద్దుతున్నారు. పలు ప్రాంతాల్లో కాలనీలవారిగా మండపాలను నిర్మించారు. ఆదివారం నుంచి 23వ తేదీ వరకు దేవీనవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. మండపాలలో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించటానికి సన్నాహాలు చేస్తున్నారు. నవరాత్రులలో ఒక్కొక్కరోజు అమ్మవారిని ఒక్కో అలంకరణతో ముస్తాబుచేసి పూజిస్తారు.

ఓల్డ్ బోయిన్‌పల్లి భవానీనగర్‌లోని దుర్గభవానీ మాతా ఆలయం, హస్మత్‌పేట విజయదుర్గ దేవి అలయం, అంజయ్యనగర్ కనకదుర్గ దేవి, నల్లపోచమ్మ దేవాలయంతో పాటు అంజయ్యనగర్, హస్మత్‌పేట చౌరస్తా సమీపంలో ఏర్పాటు చేసిన మండపాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక హోమాలు, అర్చనలు, అభిషేకాలు, పూజలు, కుంకుమార్చనలు నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు.

అమ్మవారి అలంకారాలు

దేవీ శరన్నవరాత్రుల్లో అన్ని మండపాల్లో, దేవాలయాల్లో తొమ్మిది రోజులు అమ్మవారికి విశేషాలంకారణలతో ముస్తాబు చేసి ఆయా అవతారాలలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారు. ఈ నెల 15వ తేదీన శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి, 16వ తేది శ్రీ గాయత్రీదేవి, 17వ తేదీన శ్రీ అన్నపూర్ణదేవి, 18వ తేదిన శ్రీ లలితా దేవి, 19వ తేదిన శ్రీ రాజరాజేశ్వరీ దేవి, 20వ తేదీన శ్రీ లక్ష్మీదేవి, 21వ తేదీన శ్రీ సరస్వతి దేవి, 22వ తేదిన శ్రీ దుర్గదేవి (చండీహోమాలు), 23వ తేదిన శ్రీ మహిషాసుర మర్ధినీదేవి, శ్రీ మహాకాళీ దేవి అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.24వ తేది విజయ దశమి పండుగను జరుపుకోవడం జరుగుతుందని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం, శ్రీవిజయదుర్గదేవి ఆలయం ధర్మకర్త కుమారి మామిడి పద్మశ్రీ తెలిపారు.

మోతీనగర్: శ్రీ వినాయక, శివ పార్వతి, హనుమాన్, నవగ్రహ, నాగదేవత ఆలయంలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు దుర్గామాత నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మూసాపేట: మూసాపేటలోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో ఆదివారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ సప్పిడి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం వనబాల దేవి, సోమవారం అన్నపూర్ణ దేవి, మంగళవారం గజలక్ష్మీ దేవి, బుధవారం వైష్ణవి దేవి, గురువారం గౌరీ దేవి, శుక్రవారం సరస్వతి దేవి, శనివారం రాజరాజేశ్వరి దేవి, ఆదివారం దుర్గ దేవి, సోమవారం శాంతాదేవిగా అమ్మవారు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా సామూహిక కుంకుమ పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

రూ. 9 వేల కోట్లతో అభివృద్ధి చేశాం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి బీఆర్‌యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో 9 వేల కోట్ల నిధులతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని అన్నారు. అదే విధంగా శేరిలింగంపల్లిలో పలు అభివృద్ధి పనులతో పాటు, పలు పథకాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పాల్గొన్నారు.

స్థానికేతరులకు కాంగ్రెస్‌పార్టీ టికెట్ ఇవ్వవద్దు

బాలానగర్: స్థానికేతరులకు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ టికెట్ ప్రకటిస్తే తిరగబడతామని బాలానగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, నియోజకవర్గ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి హెచ్చరించారు. స్థానికేతరులకు టిక్కెట్ ఇస్తే వందల సంఖ్యలో నామినేషన్‌లు వేస్తామన్నారు. 2018 సంవత్సరం ఎన్నికల్లో టిడిపి, కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థిగా వచ్చిన సుహాసిని ఎన్నికల తరువాత ప్రజల్లోకి రాలేదని అన్నారు. స్థానికులకే టిక్కెట్ ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర పార్టీలకు కోవర్టుగా పనిచేస్తున్న వ్యక్తికి టిక్కెట్ ఇవ్వవద్దని కార్యకర్తలు అందరూ ముక్త కంఠంతో కోరుతున్నారని పేర్కొన్నారు.

వినూత్న ప్రచారం

కుత్బుల్లాపూర్: టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి వినూత్న తరహాలో ఓటర్లను కలుస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం హెచ్ఎంటీ గ్రౌండ్‌లో వాకర్స్, క్రికెట్ ఆడుతున్న యువతను కలిసి కాంగ్రెస్ అమలు చేయనున్న ఆరు గ్యారంటీలపై ప్రచారం చేశారు. తదనంతరం కాసేపు క్రికెట్ బ్యాట్‌ను ఝుళిపించి సరదాగా గడిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీగా ఉన్న లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు.



ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలోని ప్రగతి డిగ్రీ కళాశాల ఫెషర్స్ డే వేడుకలు శుక్రవారం కూకట్‌పల్లిలోని అశోక గార్డెన్స్‌లో ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థుల కేరింతలతో, నృత్యాలతో ఆద్యంతం ఉల్లాసంగా సాగిన ఈ కార్యక్రమం ద్వారా కొత్తగా కళాశాలలో చేరిన నూతన విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. అంతకు ముందు జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ అధికారులు సుబేదార్ హర్‌దీప్ సింగ్, సుబేదార్ నిర్మల్ సింగ్ పాల్గొన్నారు.



ప్రవల్లిక కుటుంబాన్ని ఆదుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రవల్లిక మృతికి ఓయూలో వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసనలు, నివాళ్లు అర్పించారు. శనివారం విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో లైబ్రరీని బహిష్కరించి ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీగా ఆర్ట్స్ కాలేజీకి చేరుకొని ధర్నా చేపట్టారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. విద్యార్థి, నిరుద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీఆర్ఎస్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. ప్రవల్లిక మరణం ప్రభుత్వ హత్యేనని ఆమె కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోకుండా పోరాడి ఉద్యోగాలు సాధించాలని కాంగ్రెస్ నేత రియాజ్ విజ్ఞప్తి చేశారు.

20న ఓయూ పాలక మండలి సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పాలక మండలి (ఈసీ) సమావేశం ఈ నెల 20న జరగనుంది. రెండు సార్లు వాయిదాపడిన ఈసీ సమావేశాన్ని తిరిగి నిర్వహించేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఎగ్జామినేషన్ బ్రాంచ్ కొనుగోళ్లు, సస్పెండ్ అయిన సూపరింటెండెంట్ ఇంజినీర్ దేవిదాస్ అంశంతో పాటు రిటైరైన ప్రొ.అన్సారీ పింఛన్ తదితర అంశాలు చర్చకు రానున్నట్లు సమాచారం.

సరదాగా.. సందడిగా..


వేడుకల్లో పాల్గొన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

బాలానగర్: బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో... అంటూ శనివారం సాయంత్రం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని మహిళలు, ఆడపడుచులు బతుకమ్మ కుంట వద్ద ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కాంతారావు హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. మూసా పేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, మార్కెట్‌కమిటి చైర్మన్ రాములు పాల్గొన్నారు.


బాలానగర్ డివిజన్‌లో..

బాలానగర్ డివిజన్‌లో..

బాలానగర్‌కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు శనివారం జరిగాయి. బాలానగర్ డివిజన్ పరిధిలోని దుర్గామాత గుడి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మహిళలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు.